క్లుప్తంగా

రక్తదాన శిబిరానికి స్పందన



శిబిరంలో రక్త దానం చేస్తున్న విద్యార్థులు

గోపాలపట్నం: నేషనల్ వలంటరీ బ్లడ్ డొనేషన్ డే సందర్భంగా గోపాలపట్నం ఆదిత్య డిగ్రీ కళాశాలలో శనివారం రక్త దాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రముఖ వైద్యురాలు కె. స్వప్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రక్త దానం చేయడం వల్ల ఇతరుల ప్రాణాలు కాపాడవచ్చునన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కె. మురళీమోహన్‌రావు మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల ఒక ప్రాణాన్ని నిలబెట్టినవారమవుతామన్నారు. ప్లస్ బ్లడ్ బ్యాంక్ సహకారంతో శిబిరాన్ని నిర్వహించామని తెలిపారు. 50 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవోలు సీహెచ్ ఆదిబాబు, డి.గణపతి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన



వీధి నాటకం వేస్తున్న కళాకారులు

కంచరపాలెం: జీవీఎంసీ జోన్-5 పరిధిలోని 56,57, 58 వార్డుల్లో పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ వల్ల అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. జీవీఎంసీ, రసజ్ఞ సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం వీధి నాటకాలు ప్రదర్శించారు. రచయిత దండు నాగేశ్వరరావు, డాక్టర్ త్రినాథ్ దర్శకత్వంలో ప్రదర్శించిన ఎకో వైజాగ్ అనే సందేశాత్మక, హాస్యభరిత వీధి నాటకాలు అందరినీ ఆలోచింపజేశాయి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆరోగ్యంగా జీవించాలని వివరించారు. బజార్‌కు వెళ్లేటప్పుడు గుడ్డ, నార సంచులను మాత్రమే వినియోగించాలన్నారు. ఇంకుడు గోతులు ఏర్పాటు చేసి వర్షపునీటిని ఒడిసి పట్టాలన్నారు. కార్యక్రమంలో మొహిద్దీన్, హేమ, డప్పు రమణ, జయలక్ష్మి, పాలిరెడ్డి, బి.మహేంద్ర, జీవీఎంసీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కలియుగ వెంకన్నకు విశేష పూజలు



స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

కంచరపాలెం: తిక్కవానిపాలెం కలియుగ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు చామర్తి శంకర్‌శర్మ, జగనాథశర్మ ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు, తులసీదళ బిల్వార్చనలు నిర్వహించారు.

ఖైదీ మృతిపై 7న మెజిస్ట్రీరియల్ విచారణ

మహారాణిపేట: సెంట్రల్ జైలులో ఖైదీగా ఉన్న పాలాసి వెంకటరావు మృతిపై ఈనెల 7న ఉదయం 11 గంటలకు మెజిస్ట్రీరియల్ విచారణ చేస్తున్నట్టు విశాఖ రెవెన్యూ డివిజనల్ అధికారి డి.హుస్సేన్ సాహెబ్ తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మండలం బొంజంగి గ్రామం కించూరు పంచాయతీకి చెందిన పాలాసి వెంకటరావు ఒక కేసులో సెంట్రల్ జైలులో ఖైదీగా ఉన్నారు. సెప్టెంబర్ 14న అనారోగ్యానికి గురి కావడంతో కేజీహెచ్‌కు తరలించారు. 15వ తేదీన చికిత్స పొందుతూ మృతి చెందాడని ఆర్డీవో తెలిపారు. దీనిని లాకప్ డెత్‌గా పరిగణించి మెజిస్ట్రీరియల్ విచారణ చేయాలని కలెక్టర్ డాక్టర్ ఎ. మల్లికార్జున నిర్ణయించారు. ఈ విచారణ కోసం విశాఖ ఆర్డీవోను విచారణ అధికారిగా నియమించారు. విశాఖ ఆర్డీవో కార్యాలయంలో 7తేదీన విచారణ చేస్తున్నామని, వెంకటరావు కోసం తెలిసిన వారు ఎవరైనా విచారణకు హాజరై, లిఖిత పూర్వకంగా తెలియజేయాలని ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ తెలిపారు.

వెలగని దీపాలు.. వీధుల్లో అంధకారం!

- చీకట్లో ఆకతాయిల ఆగడాలు



విద్యుత్ దీపాలు వెలగక గౌరీనగర్‌లో చీకట్లు

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు గౌరీనగర్, గోకుల్‌నగర్, దుర్గానగర్, తోటవీధి, గొల్లకంచరపాలెం, రామ్మూర్తిపంతులుపేట, చాకలిగెడ్డ, గవర కంచరపాలెం ప్రాంతాల్లో అంధకారం అలముకుంటోంది. స్తంభాలకు దీపాలు లేకపోవడం, మరికొన్ని చోట్ల లైట్లు పనిచేయక పోవడంతో ఆయా కాలనీల్లో వీధులు చీకట్లు కమ్ముకుంటున్నాయి. 15 రోజులుగా ఇదే పరిస్థితి ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. 179ఎ/1, 89ఎ/6/1, 328ఏ/4/2 నుంచి స్తంభాలకు ఉన్న లైట్లు సక్రమంగా పనిచేయడం లేదు. చీకటి అలముకోవడంతో చిల్లర దొంగలు ప్రతాపం చూపిస్తున్నారని చెబుతున్నారు.

ఇదీ పరిస్థితి

గత నెలలో కురిసిన వర్షాలు, గాలులకు విద్యుత్ దీపాలు వైర్లు తెగిపోవడంతో కొన్ని ప్రాంతాల్లో చీకట్లు కనిపిస్తున్నాయి. రాత్రి సమయాల్లో ఆటుగా వెళ్లాలంటేనే పాదచారులు, స్థానికులు భయాందోళన చెందుతున్నారు. తోటవీధి, చెవిటిరాముల వీధి గొల్లకంచరపాలెం ప్రాంతాల్లో ఆకతాయిలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. రోడ్లపై మందుబాబు చిందులు వేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. సమస్యపై జీవీఎంసీ విద్యుత్ విభాగ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని పలువురు కోరుతున్నారు.



గొల్ల కంచరపాలెంలో వీధి లైటు వెలగని స్తంభం

అంతా మా ఇష్టం!

- రాంగ్ పార్కింగులతో ఇబ్బందులు



రోడ్డుపై పార్క్ చేసిన కార్లు

గోపాలపట్నం: ఎన్ఏడీ జంక్షన్ జాతీయ రహదారి నుంచి గోపాలపట్నం వెళ్లే ఫ్రీలెఫ్ట్‌లో వాహనాలు ఇష్టానుసారంగా పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోంది. రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఇక్కడి బ్రిడ్జి కింద అనధికారికంగా పార్కింగ్ చేయడం వల్ల ద్విచక్ర వాహనాలు, కార్లు వెళ్లేందుకు అవకాశం లేకుండా పోతోందని వాహన చోదకులు వాపోతున్నారు. చర్చికి వచ్చే వారు కూడా రోడ్డుపైనే పార్కింగ్ చేయడం వల్ల ఇబ్బందులు ఏర్పడుతున్నాయని చెప్పారు. దీనిపై ట్రాఫిక్ అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నా కూడా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకుని అనధికార పార్కింగ్‌లపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ముగిసిన సీంబెక్స్-23 వేడుకలు



సీంబెక్స్2023 పోస్టర్‌ను చూపుతున్న కమాండింగ్ ఆఫీసర్లు

సింధియా: సింగపూర్ ఇండియా మారిటైమ్ ద్వైపాక్షిక ఎక్సర్‌సైజ్ సెప్టెంబర్‌తో 28 ముగిసింది. భారత నౌకాదళ నౌకలు రణ్‌విజయ్, కవరత్తి, అలాగే జలాంతర్గామి, ఐఎన్ఎస్ సింధుకేసరిలు మారిటైమ్ ద్వైపాక్షిక ఎక్సర్‌సైజ్ 30వ ఎడిషన్‌లో పాల్గొనేందుకు సింగపూర్ వెళ్లిన సంగతి తెలిసిందే. ఇండియన్ నేవీ, రిపబ్లిక్ ఆఫ్ సింగపూర్ నేవీ మధ్య వార్షిక ద్వైపాక్షిక నావికా వ్యాయామం 1994 నుంచి నిర్వహిస్తున్నారు. హార్బర్ ఫేజ్‌లో విస్తృత శ్రేణి వృత్తిపరమైన పరస్పర చర్యలు, సంయుక్త విమానయానం, అగ్నిమాపక నష్ట నియంత్రణ వ్యాయామాలు, ఇరు దేశాల జలాంతర్గాముల రెస్క్యూపై జాయింట్ స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసిజర్‌పై సంతకం చేసింది. సింగపూర్‌లో భారత హైకమిషనర్ అధికారులు, భారత నావికాదళ కమాండింగ్ అధికారులు, సింగపూర్ నేవీ ఫ్లీట్ కమాండర్లు, కారంజీ వార్ మెమోరియల్ వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు.

వైభవంగా నృసింహుడికి ఆర్జిత సేవలు



యజ్ఞోపవీత ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు నరసింహాచార్యులు



గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 9.30 గంటల నుంచి నిత్య కళ్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ కల్యాణమండపంలోని వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. అర్చకులు సాతులూరి నరసింహాచార్యులు, శ్రీకాంతాచార్యులు తదితరులు ఈసేవ నిర్వహించారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం గరుడసేవ ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తి గోవిందరాజస్వామిని ఆలయ కల్యాణమండపంలోని గరుడవాహనంపై అధిష్టింపజేశారు. అష్టోత్తర శతనామావళి పూజ అనంతరం భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. విశేషంగా హారతులు అందజేశారు.

సంపత్ వినాయగర్ హుండీ ఆదాయం రూ.16.28 లక్షలు



హుండీ లెక్కిస్తున్న శివజ్యోతి, వేంకటేశ్వర సేవా సంఘం సభ్యులు

సీతమ్మధార : ఆశీలమెట్టలో గల సంపత్ వినాయగర్ ఆలయంలో దేవదాయ శాఖ తనిఖీదారు బి.వసంత్‌కుమార్ ఆధ్వర్యంలో హుండీని శనివారం లెక్కించగా 14 రోజులకు రూ.16.28 లక్షలు వచ్చాయి. బంగారం నాలుగు గ్రాముల 513 మిల్లీ గ్రాములు, వెండి 172 గ్రాముల 700 మిల్లీ గ్రాములు, ఇతర దేశాల డాలర్లు వచ్చినట్లు ఆలయ ఫౌండర్, ఫ్యామిలీ మెంబర్ టి.చోళన్ తెలిపారు. హుండీ లెక్కింపులో శివజ్యోతి, వేంకటేశ్వర సేవా సంఘం సభ్యులు, దేవాలయ సిబ్బంది జి.గోవిందరెడ్డి, డి.ఎస్. ప్రసాద్, ఈ. అప్పలరాజు, బ్యాంక్ ఆఫ్ ఇండియా సిబ్బంది పాల్గొన్నారు.

'మరిన్ని కుంభకోణాల్లో బాబుకు శిక్ష తప్పదు'



సమావేశంలో మాట్లాడుతున్న మంగరాజు

డాబాగార్డెన్స్ : నేను నిప్పు.. నేను ఉప్పు అన్న చంద్రబాబునాయుడు నేడు రాజమండ్రి సెంట్రల్ జైల్లో తుప్పయ్యారని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యుడు డాక్టర్ చీకటిమిల్లి మంగరాజు అన్నారు. డాబాగార్డెన్స్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబునాయుడు దొంగల ముఠా నాయకుడని విమర్శించారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో రూ. 371 కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. ఔటర్‌రింగ్ రోడ్డు, ఫైబర్‌గ్రిడ్, అమరావతి భూముల వ్యవహారాల్లోనూ, పోలవరం ప్రాజెక్టు సబ్‌కాంట్రాక్ట్ వ్యవహారంలోనూ ఇంకా శిక్ష పడాల్సి ఉందని చెప్పారు. 14 ఏళ్ల కాలంలో సుమారు రూ.2 లక్షల కోట్ల పైచిలుకు సంపాదించారని తెలిపారు. టీడీపీ శ్రేణులు సానుభూతికి దీక్షలు చేస్తున్నారని, కానీ ప్రజల్లో స్పందన లేదన్నారు. తప్పు చేయకపోతే బెయిల్ తెచ్చుకోవచ్చు కదా? అని ప్రశ్నించారు. స్టేలు తెచ్చుకోకపోతే ఇప్పటికే జైలు జీవితం గడిపేవారన్నారు. లోకేష్‌కు సీఐడీ అధికారులు నోటీసులు ఇచ్చారని, ఎంత గొప్పవారైనా చట్టం ముందు సమానమేనన్నారు. లోకేష్ కూడా తప్పు చేశాడని చెప్పడానికి ముందస్తు బెయిల్ పిటిషనే నిదర్శనమన్నారు. చంద్రబాబు కేసులో అన్ని ఆధారాలు చూసి, జడ్జి తీర్పు ఇస్తే సోషల్ మీడియాలో జడ్జిపై అసభ్యంగా ట్రోల్ చేయడాన్ని మంగరాజు తీవ్రంగా ఖండించారు. ట్రోల్ చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దసరా నుంచి విశాఖ కేంద్రంగా పరిపాలన సాగిస్తానని ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రకటనపై మాల మహానాడు స్వాగతిస్తుందన్నారు. విజయవాడలో యావత్ దేశం హర్షించేలా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహాన్ని సుమారు రూ.400 కోట్లకు పైగా వెచ్చించి నిర్మించడం అభినందనీయమన్నారు. ఎన్ని అసత్య ప్రచారాలు చేసినా 2024 ఎన్నికల్లో 175 సీట్లు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గెలుచుకోవడం ఖాయమన్నారు. సమావేశంలో టి.శివ, డి. కోటేశ్వరరావు, పి. రామారావు, వెంకటేశ్వరరావు, సందీప్, సునీల్‌బాబు, రోహిత్ పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక



వైవీ సుబ్బారెడ్డిని సత్కరిస్తున్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, బద్రీనాథ్

మల్కాపురం: వైఎస్సార్‌సీపీ రీజినల్ కో-ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డిని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్ తదితరులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. నగరంలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో కలిసి, సత్కరించారు. వైవీ సుబ్బారెడ్డిని కలిసిన వారిలో పార్టీ నాయకులు నమ్మి శ్రీనుయాదవ్, పిలక రామ్మోహన్‌రెడ్డి, అంగ రామ్‌ప్రసాద్, పిల్లా కన్నబాబు, సోమాదుల సురేష్, ఆడారి హరీష్ తదితరులున్నారు.

సెయింట్ జోసెఫ్‌లో ప్రోగ్రామర్ల దినోత్సవం



విజేతలతో అధ్యాపకులు డాక్టర్ జయలక్ష్మి, డాక్టర్ హరిణి

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ ప్రోగ్రామర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ప్రోగ్రామింగ్‌పై నమూనాలు ప్రదర్శించి రోజువారీ జీవితంలో దాని ప్రాముఖ్యతను వివరించారు. కోడ్ విజార్డ్, టెక్ క్విజ్, హగ్ ద బగ్, స్పిన్ ది వీల్ తదితర ఆటలు, ఈవెంట్లు నిర్వహించి విజేతలకు డాక్టర్ పి.కె.జయలక్ష్మి, డాక్టర్ హరిణి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కె.శిరీష్, ఎస్.మాధురి, అనితా రాణికుంకుమ్, ఊర్మిళ, బి. దఫియా తదితరులు పాల్గొన్నారు.

అతి పే..ద్ద అరటి గెల



ఎంవీపీ రైతు బజార్‌లో 300 పండ్లతో అరటి గెల..

ఆరిలోవ: ఎంవీపీ రైతు బజార్‌కు శనివారం 300 పండ్లతో పెద్ద అరటి గెలను ఓ రైతు తీసుకొచ్చాడు. కోటవురట్ల మండలం విశ్వనాథపురం గ్రామానికి చెందిన శ్రీను అనే రైతు ఇక్కడ బజార్‌కు తీసుకొచ్చిన సుమారు మూడున్నర అడుగులకు పైగా పొడవున్న ఈ అరటి గెలకు 16 పెడలు ఉన్నాయి. దానికి సుమారు 300 అరటి పండ్లు ఉన్నాయి. సాధారణంగా అరటి గెలకు 7 నుంచి 10 వరకు పెడలు, 150 నుంచి 180 వరకు పండ్లు ఉంటాయి. సపోటా ముకిరీ అనే పిలిచే ఈ గెలకు మాత్రం 16 పెడలున్నాయి.

'నీ వెంటే నేనున్నా' ట్రైలర్ విడుదల



ట్రైలర్ విడుదల కార్యక్రమంలో పాల్గొన్న చిత్ర యూనిట్

అల్లిపురం : 'నీ వెంటే నేనున్నా' చిత్రం ట్రైలర్ శనివారం రాత్రి చిత్ర యూనిట్ విడుదల చేసింది. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో చిత్ర దర్శకుడు అన్వర్ మాట్లాడుతూ ఒక ఊరిలో ఇద్దరు ప్రేమికుల మధ్య జరిగిన యదార్థ సంఘటన ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించినట్లు తెలిపారు. చిత్ర నాయికా, నాయకులు బాలసుబ్రహ్మణ్యం, స్నేహ మాట్లాడుతూ తమకు తొలి చిత్రమన్నారు. ఇందులో కొన్ని సన్నివేశాలు ప్రేక్షకులను మైమరిపిస్తాయన్నారు. నిర్మాత వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అక్టోబర్ 6న ఓటీటీ ద్వారా చిత్రం విడుదల చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంగీత దర్శకుడు షషాంక్ బాస్కరోని, నటీనటులు గణేష్, అనురాధ, దాడి సత్యనారాయణ పాల్గొన్నారు.

వైద్య శిబిరంలో 260 మందికి పరీక్షలు



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: గోపాలపట్నం 30 పడకల ఆస్పత్రిలో ఆయుష్మాన్ భవ వైద్యశిబిరాలు శనివారం ముగిశాయి. ఆయుష్మాన్‌భవ కార్యక్రమంలో భాగంగా మూడో విడతగా ఆస్పత్రిలో శనివారం ఏర్పాటు చేసిన శిబిరాన్ని జీవీఎంసీ కో-ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత ఇక్కడి 30 పడకల ఆసుపత్రిలో వసతులు మెరుగు పడ్డాయన్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతీ వారం ఆరోగ్య మేళా చేపడుతున్నామని తెలిపారు. ఈ శిబిరంలో జనరల్ ఫిజీషియన్, జనరల్ సర్జన్, పిల్లల వైద్య నిపుణులు, గైనకాలజిస్ట్ వైద్య పరీక్షలు చేశారు. శిబిరంలో 260 మంది రోగులు బీపీ, షుగర్ తదితర వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో వైద్యులు నివేదిత, సుజాత, యుగేష్ కుమార్, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు అప్పలస్వామి నాయుడు, కంపర సత్తిబాబు, వంశీ శ్రీకాంత్ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన వినాయక ఉత్సవాలు



అన్న సమారాధనలో పాల్గొన్న కార్పొరేటర్ సుధ

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం, గాంధీజీ వీధి వద్ద స్థానిక యంగ్‌బాయ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన వినాయక ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. బల్లవేషాలు, సేవాగరిడీ, సాముగరిడీలతో స్వామి వారి ఊరేగింపు కోలాహలంగా సాగింది.

- గొల్లవీధి వద్ద యాదవ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా యువకులు ఉట్టి సంబరాలు నిర్వహించారు. యువత ఉట్టి కొట్టేందుకు పోటీ పడ్డారు.
- ఆర్‌కే పురం వద్ద జరిగిన ఉత్సవాల్లో కార్పొరేటర్ కొణతాల సుధ దంపతులు పాల్గొని గణనాథుడికి పూజలు చేశారు. మండపం వద్ద నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్న సమారాధనను ఆమె ప్రారంభించారు.
- 58వ వార్డు పిలకవానిపాలెం వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద అన్న సమారాధన నిర్వహించారు. స్థానికులు అధిక సంఖ్యలో హాజరై అన్న ప్రసాదం స్వీకరించారు.

ప్రజారోగ్యానికి రక్ష- జగనన్న ఆరోగ్య సురక్ష



మాట్లాడుతున్న కార్పొరేటర్ లక్ష్మణరావు

సింధియా: రాష్ట్రం ప్రజలు వైద్యం కోసం ఇబ్బంది పడకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని తీసుకువచ్చారని 62వ వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు అన్నారు. జీవీఎంసీ 62వ వార్డు దుర్గానగర్-4 సచివాయం(186343) పరిధిలోని ఆరోగ్య సిబ్బంది, వార్డు వలంటీర్లలతో ఫీల్డ్ ఆపరేషన్ ఏజెన్సీ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై అవగాహన కల్పించారు. వలంటీర్లు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు వార్డులోని ప్రతి ఇంటిని సందర్శించి ప్రజల ఆరోగ్య పరిస్థితి గురించి ఆరా తీస్తారన్నారు. వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో మెరుగైన వైద్యాన్ని అందిస్తారన్నారు. స్పెషలిస్ట్ డాక్టర్లు పరీక్షించి అవసరమైన వారికి ఉచితంగా చికిత్సతో పాటు మందులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సచివాయల సిబ్బంది ప్రజలకు అర్థమయ్యే రీతిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం గురించి వివరించాలని కోరారు. కార్యక్రమంలో సచివాయల కన్వీనర్లు నక్కా సూర్యనారాయణ, భారతి, సత్యనారాయణ, నాయకులు భూషణం, మసేనమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆల్ ద బెస్ట్ అథ్లెట్ జ్యోతి



విశాఖ స్పోర్ట్స్: ఆసియన్ గేమ్స్‌లో విశాఖ అథ్లెట్ జ్యోతి ఎర్రాజీ తొలి హీట్‌ను 13.03 సెకన్లలో పూర్తి చేసి ఫైనల్స్‌కు అర్హత సాధించింది. ప్రపంచ ర్యాంకింగ్‌లో 24వ స్థానంలో ఉన్న జ్యోతి తొలిరౌండ్ హీట్‌లో 297 బిబ్‌తో 6వ లేన్‌లో పరుగెత్తింది. ఇదే హీట్‌లో పాల్గొన్న చైనాకు చెందిన లిన్ వై 12.79 సెకన్లలో వంద మీటర్ల హార్డిల్స్‌ను పూర్తి చేసి పెర్సనల్ బెస్ట్‌తో తొలి స్థానంలో నిలిచింది. అయితే ఆసియన్ గేమ్స్‌లో వుమెన్ 100 మీటర్ల హార్డిల్స్ 12.63 సెకన్లతో పూర్తి చేసిన రికార్డు షిషిగ్నా(1998) పేరిట ఉంది. కాగా.. జ్యోతి ఆసియన్ చాంపియన్‌షిప్‌లో 100 మీటర్ల హార్డిల్స్‌ను 13.09 సెకన్లలోనే పూర్తి చేయగా.. బుడాపెస్ట్‌లో జరిగిన వరల్డ్ చాంపియన్‌షిప్ హీట్‌లో 13.05 సెకన్లలోనే పూర్తి చేసింది. ఆసియన్ గేమ్స్ హీట్‌లో 0.02 సెకన్లు మెరుగుపడింది. వుమెన్ 200 మీటర్ల పరుగులోనూ జ్యోతి పోటీ పడనుండగా ఆదివారం ఉదయం ఈ పోటీ జరగనుంది. ఆసియాలోని మేటి 8 మంది వుమెన్ హార్డిలర్స్ ఆదివారం రాత్రి 9.15 గంటలకు జరిగే ఫైనల్స్‌లో వుమెన్ ఫాస్టెస్ట్ హార్డిలర్‌గా నిలిచేందుకు పోటీపడనున్నారు. వరల్డ్ ర్యాంకింగ్‌లో ముందున్న జ్యోతి భారత పతాకను క్రీడా వినువీధిలో రెపరెపలాడించాలని ఆకాంక్షిద్దాం. ఆల్ ద బెస్ట్ జ్యోతి.

బీఐఎస్ హాల్‌మార్క్‌పై అవగాహన అవసరం



మాట్లాడుతున్న చదలవాడ బాబు

సీతమ్మధార: విద్యార్థి దశ నుంచే బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్(బీఐఎస్) హాల్‌మార్క్‌పై అవగాహన కలిగి ఉండాలని సీపీఐ జాతీయ వైస్ ప్రెసిడెంట్ చదలవాడ బాబు సూచించారు. సీతమ్మధార పీ అండ్ టీ కాలనీలోని జీవీఎంసీ హైస్కూల్‌లో శనివారం స్టాండర్డ్ క్లబ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఐఎస్ గుర్తు కలిగిన వస్తువులను మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. ఈ మార్క్‌తో నాణ్యమైన భద్రత వస్తువులు మాత్రమే ఇస్తారని, కొనుగోలు విషయంలో వినియోగదారులకు సహాయకరంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం రాంప్రసాద్, క్లబ్ గైడ్ నాగభూషణం, ఏపీ వినియోగదారుల సంఘాల సమైక్య కాప్కో రాష్ట్ర కార్యదర్శి హెచ్.ఎస్.రామకృష్ణ, మణిభూషన్, సరోజని తదితరులు పాల్గొన్నారు.

3న డయల్ యువర్ పోలీస్ కమిషనర్

అల్లిపురం: డయల్ యువర్ సీపీ కార్యక్రమాన్ని ఈ నెల 3న నిర్వహిస్తున్నట్లు నగర పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్ తెలిపారు. ఈ నెల 1, 2 తేదీల్లో సెలవు దినాలు కావడంతో 3న ఉదయం 11 నుంచి 12 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 0891-2523408 నంబర్‌కు కాల్ చేసి సమస్యలను సీపీ దృష్టికి తీసుకెళ్లవచ్చు. 94933 36633 నంబర్‌కు వాట్సాప్ చేసి కూడా ఫిర్యాదు చేయవచ్చు.

వైభవుడికి సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున గొల్లసన్నిధి సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. సాయంత్రం 5.30 గంటలకు ఆకాశ దీపారాధన, 7 గంటలకు నక్షత్ర, కుంభ హారతులు స్వామికి సమర్పించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో వైభవుడిని దర్శించుకున్నారు.